క్లుప్తంగా

ఉద్యమకారుల పాత్ర మరువలేనిది



సంపత్‌ను సన్మానిస్తున్న ఎంపీ వద్దిరాజు

ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణ ఏర్పాటుకు సాగిన పోరాటంలో ఉద్యమకారుల పాత్ర మరువలేనిదని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర అన్నారు. ఖమ్మంలో శనివారం తెలంగాణ యువజన ఉద్యమకారుల ఆత్మీయ సమావేశం నిర్వహించగా ఉద్యమకారుడు పానుగోటి సంపత్‌ను ఎంపీ సత్కరించి మాట్లాడారు. కాగా, ఉద్యమకారులకు సీఎం కేసీఆర్ మెరుగైన అవకాశాలు కల్పిస్తున్న నేపథ్యాన, రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

ఖమ్మంఅర్బన్: నగరంలోని 4వ డివిజన్ కైకొండాయిగూడెం క్రాస్‌రోడ్డులోని శ్రీ అంకమ్మ, శ్రీ మహాలక్ష్మమ్మ, శ్రీ మద్దిరావమ్మ అమ్మవార్ల దేవాలయ నిర్మాణానికి శనివారం ఇద్దరు దాతలు కలిసి రూ.13, 232 విరాళంగా అందించినట్లు దేవాలయ కమిటీ సభ్యులు తెలిపారు. బాలాజీనగర్‌కు చెందిన కోయ శ్రీనివాసరావు-నర్సమ్మ దంపతులు రూ.10,116 ఇవ్వగా.. పెండ్యాల వెంకయ్య రూ.3,116 అందించినట్లు తెలిపారు.

సీట్ల కోసం ఒత్తిడి తీసుకురావాలి



మంద కృష్ణను సన్మానిస్తున్న రవి, సోమ చంద్రశేఖర్

ఖమ్మంమామిళ్లగూడెం: ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి, తెలంగాణ మాదిగ రాజకీయ పోరాట వేదిక కన్వీనర్ వక్కలగడ్డ సోమచంద్రశేఖర్ శనివారం హైదరాబాద్‌లో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగను కలిశారు. ఈసందర్భంగా జనాభా దామాషా ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా మాదిగలకు అన్ని పార్టీలు 15 సీట్లు కేటాయించేలా ఒత్తిడి తీసుకురావాలని వారు కోరారు. ఉమ్మడి జిల్లాకు ఒకటి చొప్పున మాదిగలకు సీటు ఇచ్చేందుకు కృషి చేయాలని కోరాక, మంద కృష్ణను వారు సన్మానించారు.

104 ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

ఖమ్మంమయూరిసెంటర్: గత పదిహేనేళ్లుగా ఎలాంటి భద్రత లేకుండా చాలీచాలని వేతనాలతో ప్రజలకు సేవ చేస్తున్న 104 ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలని సీఐటీయూ నాయకుడు విష్ణువర్ధన్ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం ఐడీఓసీ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యాన 104 ఉద్యోగులు తమ సమస్యలను పరిష్కరించాలని ధర్నా నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఏజెన్సీ విధానాన్ని రద్దు చేసి, ప్రభుత్వ ఖజానా నుంచి వేతనాలు చెల్లించాలన్నారు. వీటితో పాటు తదితర పలు సమస్యలను పరిష్కరించాలని కోరారు.

నగరంలో సినిమాలు

తిరుమల	ఖుషి
వినోద	జైలర్
సాయిరాం	బెదురులంక 2012
ఆదిత్య	ఖుషి
శ్రీనివాస	ఖుషి
సుందర్	ఖుషి

- ఖమ్మంగాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	20	బచ్చలికూర	5
వంకాయ	36		20
బెండకాయ	20	పాలకూర	4
పచ్చిమిర్చి	56		20
కాకర	24	చుక్కకూర	4
బోడ కాకర	120		20
బీర	36	తోటకూర	5
దొండ	26		20
పొట్లకాయ	30	గోంగూర	4
చిక్కుడు	50		20
గోరుచిక్కుడు	36	మెంతికూర	4
క్యాబేజీ	20		20
క్యాలీఫ్లవర్	40	కొత్తిమీర	1
ఆలుగడ్డ	26		30
చామగడ్డ	40	పుదీన	1
క్యారెట్	40		20
క్యాప్సికం	36	-ఖమ్మం వ్యవసాయం	

జనహృదయ నేత వైఎస్సార్..

ఘనంగా వైఎస్సార్ వర్ధంతి వేడుకలు

పేదల జీవితాల్లో వెలుగులు నింపి, ప్రజల హృదయాల్లో స్థిరమైన స్థానం సంపాదించుకున్న మహానేత దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి అని పలువురు వక్తలు అన్నారు. శనివారం మండలాల్లో వైఎస్సార్ వర్ధంతిని కాంగ్రెస్ పార్టీ, వైఎస్సార్‌టీపీ ఆధ్వర్యాన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ విగ్రహాలు, చిత్రపటాలకు ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈనేపథ్యాన ఆస్పత్రులు, అనాథ శరణాలయాల్లో బాధితులకు, వృద్ధులకు పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. అనంతరం వైఎస్సార్ ప్రజలకు అందించిన సేవలను పలువురువివరించారు. - సాక్షి నెట్‌వర్క్



కూసుమంచి: గట్టుసింగారంలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



రఘునాథపాలెం: కోటపాడులో నివాళులర్పిస్తున్న సర్పంచ్ రమణసుధాకర్, తదితరులు



ఖమ్మంరూరల్: వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌టీపీ నాయకులు



తిరుమలాయపాలెం: సుబ్లేడులో నినాదాలు చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు



కామేపల్లి మండలం ముచ్చర్లలో పులిహోర, పండ్లు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



కూసుమంచి: పాలేరులో నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌టీపీ నాయకులు



నేలకొండపల్లి: ఆస్పత్రిలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యాన బ్రెడ్ ప్యాకెట్ల పంపిణీ..



ఖమ్మంమయూరిసెంటర్: రాపర్తినగర్ బోర్డు వద్ద వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న లక్కినేని సుధీర్‌బాబు, తదితరులు



ఖమ్మంరూరల్: పెదతండాలో నివాళులర్పిస్తున్న వైఎస్సార్ అభిమానులు



నేలకొండపల్లి: గువ్వలగూడెంలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ సేవాదళ్ పాలేరు నియోజకవర్గ కన్వీనర్ బచ్చలకూరి నాగరాజు



రఘునాథపాలెం: వేపకుంట్లలో నివాళులర్పిస్తున్న దృశ్యం

మండలంలో ఎమ్మెల్యే విస్తృత పర్యటన



ఆచార్లగూడెం విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న కందాళ

నేలకొండపల్లి/ఖమ్మంరూరల్: మండలంలోని వివిధ గ్రామాల్లో పాలేరు శాసనసభ్యుడు కందాళ ఉపేందర్‌రెడ్డి శనివారం విస్తృతంగా పర్యటించారు. రాజేశ్వరపురంలోని నూతనంగా నిర్మించనున్న కంఠమహేశ్వరస్వామి దేవాలయ నిర్మాణానికి రూ.3 లక్షలు విరాళం అందించారు. ఆచార్లగూడెంలో కాటమరాజు స్వామి ప్రతిష్ఠ మహోత్సవానికి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. నేలకొండపల్లిలో నూతనంగా నిర్మించిన పాండవుల, పెద్దమ్మ తల్లి దేవాలయాల్లో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన వెంట జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ మరికంటి ధనలక్ష్మి, ఎంపీపీ వజ్జా రమ్య, సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు గండు సతీష్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సొసైటీ చైర్మన్లు, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు. అలాగే ఖమ్మంరూరల్ మండలంలోని పోలేపల్లిలో ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌తో మృతి చెందిన మిడకంటి ఉపేందర్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. ఎం వెంకటాయపాలెంలో ఇటీవల మృతి చెందిన ఇద్దరి కుటుంబసభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు బెల్లం వేణు, జి.సంజీవరెడ్డి, ఎ.వెంకన్న, లక్ష్మణ్‌నాయక్, షేక్. ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

కందాళను కలిసిన గోళ్లపాడు వాసులు

కూసుమంచి: పాలేరు ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డిని ఆదివారం క్యాంపు కార్యాలయంలో గోళ్లపాడు వాసులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. పాలేరు బీఆర్‌ఎస్ అభ్యర్థిగా కందాళను ఎంపిక చేయటం పట్ల ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపి, రాబోయే ఎన్నికల్లో తామంతా మీ వెంటే ఉంటామని మద్దతు ప్రకటించారు. సంక్షేమ పథకాలే కాకుండా వ్యక్తిగత సహాయాలు అందించి ఆదుకున్నారని గ్రామస్తులు పేర్కొన్నారు.

కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

ఖమ్మంమయూరిసెంటర్: గ్రామదీపికల గౌరవ వేతనం పెంపును హర్షిస్తూ బీఆర్‌టీయూ ఆధ్వర్యాన గ్రామదీపికలు శనివారం మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ క్యాంపు కార్యాలయంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. రూ.3,900ల నుంచి రూ.5,000 లకు వేతనం పెంచడం పట్ల సీఎం కేసీఆర్, మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఓఏల జిల్లా అధ్యక్షురాలు సుశీల, జిల్లా కార్యదర్శి కొర్ర శ్రీనివాసరావు, రమేష్, జయరాజు, బీఆర్‌టీయూ నాయకులు ఎండీ.వై పాషా, పాల్వంచ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పాలాభిషేకం చేస్తున్న గ్రామదీపికలు

ఉచిత వైద్య శిబిరం విజయవంతం



మందులు పంపిణీ చేస్తున్న వైద్యులు,నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని సుందరయ్య భవనంలో శనివారం సీపీఎం టూటౌన్ కమిటీ-బీవీకే ఆధ్వర్యాన నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ సందర్భంగా హైదరాబాద్ యశోద ఆస్పత్రి వైద్య బృందంచే 200 మందికి టూడీ ఏకో పరీక్షలు నిర్వహించారు. కాగా ఈ వైద్య శిబిరాన్ని ఏఆర్‌ఐ వాసిరెడ్డి దయానంద్, సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావులు ప్రారంభించి మాట్లాడారు. అందరికీ తక్కువ ఖర్చుతో వైద్య సౌకర్యాలు కల్పించడానికి ఒక సంజీవనిలా ఖమ్మంలో మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. వైద్యులు సి.భారవి, రావిళ్ల రంజిత్, కొల్లి అనుదీప్, పి.సుబ్బారావు, జెట్ల రంగారావు, జి.రాజేష్‌లు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వై.విక్రమ్, వై.శ్రీనివాసరావు, చంద్రశేఖర్, బోడపట్ల సుదర్శన్, శివనారాయణ, వాసిరెడ్డి వీరభద్రం, నర్రా రమేష్, పి.వాసు, అఫ్జల్, పి.కృష్ణారావు, అరుణ, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ‘గృహలక్ష్మి’ అందించాలి



ఎంపీడీఓకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

నేలకొండపల్లి: అర్హులకు గృహలక్ష్మి పథకం మంజూరు చేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ పాలేరు ఇన్‌చార్జ్ పసుమర్తి శ్రీనివాస్ కోరారు. దరఖాస్తు చేసుకున్న ప్రతీ ఒక్కరికి అందించాలని కోరుతూ శనివారం ఎంపీడీఓ కె.జమలారెడ్డికి వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గృహలక్ష్మి ఎంపికలో రాజకీయ ప్రమేయం లేకుండా చూడాలని, క్షేత్రస్థాయిలో విచారణ చేసి, పథకం కింద రూ.5లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఇప్టూ పాలేరు డివిజన్ కార్యదర్శి పగిడికత్తుల రామదాసు, సామాజిక కార్యకర్త కె.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలు



పాతయాత్ర చేస్తున్న జనసేన నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా నగరంలోని గుంటుమల్లేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. తరువాత ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మిరియాల రామకృష్ణ ఆధ్వర్యాన నయాబజార్ కళాశాల నుంచి రేవతి సెంటర్ వరకు ‘జనసేన యువశక్తి’పేరుతో పాదయాత్ర నిర్వహించారు. 43వ డివిజన్‌లో ఏర్పాటు చేసిన జనసేన జెండా దిమ్మను ఆవిష్కరించి, గట్టయ్య సెంటర్‌లోని క్రీడా ప్రాంగణంలో రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు దుంపటి శ్రీనివాస్, నగర అధ్యక్ష, కార్యదర్శులు ఎం.కార్తీక్, అజయ్‌కృష్ణ, ఉపాధ్యక్షులు దేవేందర్, హసీనా, మహిళా అధ్యక్షురాలు హరిప్రియ, ప్రవంత్, విజయ, గాంగాధర్, ఉత్తమ్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలోనే రేషన్ డీలర్లకు గుర్తింపు

- మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి

ఖమ్మంఅర్బన్: తెలంగాణ వచ్చాకే సీఎం కేసీఆర్ సారథ్యాన రేషన్ డీలర్ల సమస్యలను పరిష్కరించడంతో పాటు తగిన గుర్తింపు వచ్చిందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. నగరంలోని అల్లీపురంలో శనివారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి రేషన్ డీలర్ల సమ్మేళనంలో మంత్రి మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో క్వింటాకు రూ.20 కమీషన్ ఉండగా, తెలంగాణ వచ్చాక రూ.70కి పెంచడంతో పాటు తాజాగా రూ.140 చేశారని చెప్పారు. కాగా, డీలర్ల సమస్యలు పరిష్కరించడంపై ముఖ్యమంత్రి కేసీఆర్, సివిల్ సప్లయీస్, ఆర్థిక శాఖల మంత్రులు గంగుల కమలాకర్, హరీశ్‌రావుకు పువ్వాడ ధన్యవాదాలు తెలిపారు. రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఇబ్రహీం అధ్యక్షతన జరిగిన సమావేశంలో సుడా చైర్మన్ విజయ్‌కుమార్, కార్పొరేటర్ మక్బూల్, చామకూరి వెంకన్న, నాయకులు పరమేష్, మోటమర్రి చంద్రశేఖర్‌రావు, ఏ.కే.శేఖర్, గోళ్ల మురళి, లగిశెట్టి వెంకటేశ్వర్లు, సుధాకర్, బిచ్చు, ఉమామహేశ్వరరావు, వి.బాబు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా పునరేకీకరణ పరిశీలన



కార్యక్రమాన్ని పరిశీలించి సూచనలు చేస్తున్న కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి

ఖమ్మంసహకారనగర్: ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త పునరేకీకరణ కార్యక్రమ నిర్వహణను కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి పరిశీలించారు. శనివారం స్వచ్ఛత సమానత, సమగ్రత, పారదర్శకత, సాంకేతికత కార్యక్రమం సందర్భంగా ఎస్ఆర్‌అండ్‌బీ జీఎన్ఆర్ కళాశాల, ఉమెన్స్ డిగ్రీ కాలేజీ, డీఎఫ్‌ఓ కార్యాలయాల్లో ఎఫ్ 6,7,8 ఫామ్‌లను తీసుకునే సందర్భంగా తీసుకోవాల్సిన అంశాలపై బీఎల్‌ఓలు అడిగి తెలుసుకున్నారు. అలాగే ఓటర్ హెల్ప్‌లైన్ యాప్ గురించి విద్యార్థులకు, ఓటర్లకు, ఎలా ఉపయోగపడుతుందో బీఎల్‌ఓలు వివరించాలని కమిషనర్ ఆదేశించారు.

ఓటు హక్కుపై అవగాహన పెంచాలి



కోరట్లగూడెంలో వివరాలు సేకరిస్తున్న ఎన్నికల అధికారి రాజేశ్వరి

నేలకొండపల్లి: ఓటు హక్కుపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని పాలేరు ఎన్నికల అధికారి రాజేశ్వరి సూచించారు. శనివారం మండలంలో జరుగుతున్న స్పెషల్ ఓటు హక్కు నమోదు కార్యక్రమాన్ని పరిశీలించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా ఓటరు నమోదుపై వివరాలు సేకరించాక స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఎన్నికల విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి తహసీల్దార్ ఎస్.శ్వేత, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మాధవి, జూనియర్ అసిస్టెంట్ సుందర్‌సింగ్, బూత్ లెవల్ అధికారులు బచ్చలకూరి నిర్మల, కల్పన, విజయలక్ష్మి, ఉమ తదితరులు పాల్గొన్నారు.

మా ఓటు ఉందా.. లేదా?!



జాబితాలో పరిశీలిస్తున్న మహిళ

ఖమ్మంఅర్బన్: నగరంలోని 7వ డివిజన్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్ల జాబితాలో తమ పేర్లు ఉన్నాయా.. లేవా అంటూ శనివారం ఓటర్లు బారులుదీరారు. జాబితాలో తమ పేర్లు, అడ్రస్ తప్పులు లేకుండా సక్రమంగా ఉందో లేదోనని ఆరా తీశారు. దీంతో పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లతో సందడి నెలకొంది.

ఇష్టారాజ్యంగా మారిన ప్రభుత్వ పథకాలు



సమావేశంలో మాట్లాడుతున్న సుధాకర్

నేలకొండపల్లి: తెలంగాణ ప్రభుత్వం ప్రకటించే సంక్షేమ పథకాలు బీఆర్‌ఎస్ నాయకుల ఇష్టారాజ్యంగా మారాయని బీసీ జేఏసీ పాలేరు నియోజకవర్గ కన్వీనర్ పాగర్తి సుధాకర్ ఆరోపించారు. శనివారం మండలంలోని కొత్తకొత్తూరులో నిర్వహించిన బీసీ జేఏసీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన బీసీ బంధు పథకం పాలేరు డివిజన్‌లో పూర్తిగా బీఆర్‌ఎస్ నిధులుగా వారి కార్యకర్తలకు మాత్రమే అందిస్తున్నారని, సమగ్ర విచారణ నిర్వహించి అర్హత లేని వారి నుంచి రికవరీ చేసి అర్హులకు ఈ పథకం వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. అలాగే నియోజకవర్గంలో బీసీ భవన్ నిర్మాణానికి స్థలం, నిధులు ప్రభుత్వం కేటాయించాలని, గృహలక్ష్మి పథకం కింద రూ.5 లక్షలు మంజూరు చేయాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు తొగటి నాగచారి, తుడిమళ్ల ఉపేంద్రచారి, కొత్తపల్లి వెంకటేష్, కందరబోయిన గోపి, బొమ్మ సత్యనారాయణ, దేవరశెట్టి రాము, నిమ్మల వెంకన్న, పిట్టల సూరిబాబు, కంది రామకృష్ణ చారి తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర ఆలయంలో ప్రసాదం విక్రయానికి అనుమతి



పులిహోర ప్యాకెట్లు విక్రయిస్తున్న నిర్వాహకులు

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం కమాన్‌బజార్‌లోని శ్రీ వేంకటేశ్వర దేవస్థానంలో ప్రసాదాల విక్రయానికి రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ అనుమతి జారీ చేసింది. ఆలయాల నిర్వహణ, భక్తుల ఆదరణ తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని ప్రత్యేక పూజలకు అనుమతిస్తున్నారు. ఇందులో భాగంగా వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ప్రతీ పౌర్ణమికి సుదర్శన హోమం నిర్వహించేందుకు ఇటీవల అనుమతించగా, తాజాగా ప్రసాదాల విక్రయానికి కూడా పచ్చజెండా ఊపింది. ఈ ఆలయంలో ప్రతీ శనివారం భక్తుల రద్దీ ఉంటున్న నేపథ్యాన పులిహోర, లడ్డూల విక్రయానికి అనుమతించగా, తయారీ, విక్రయ బాధ్యులను అర్చకులకు అప్పగించారు. ఆలయ ఈఓ కొత్తూరు జగన్మోహన్‌రావు శనివారం విక్రయాలను ప్రారంభించారు.

ప్రచారానికి సిద్ధం..!



ఎన్నికల నోటిఫికేషన్ వెలువడకముందే జిల్లాలో ఎన్నికల వేడి మొదలైంది. ప్రస్తుతం ఆశావహులు ప్రచార రథాలను సిద్ధం చేసుకుంటున్నారు. ఒకవైపు టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తూనే.. మరోవైపు ప్రచారానికి సంబంధించిన రథాలను, ఇతర సరంజామాను సిద్ధం చేసుకుంటున్నారు. కాగా, శనివారం ఈ వాహనం ఓ షోరూమ్ ఎదుట ఇలా కనిపించింది.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్